# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

SEPTEMBER 1995

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు M O. చేసినచో రూ. 100/- లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్లు వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | కీర్తన పుస్తకం | రూ. 14-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25-00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**S A T Y A V A N I**
Sambamurthi Street, Ramaraopet,
K A K I N A D A - 533 004.

**Printed by SATYAVANI, Kakinada.**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-73722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 సెప్టెంబరు 1995 సంచిక 2

# సంపాదకీయం

## ఆశ్చర్య కరుడైన దేవుడు
## (The Amazing God)

దేవుడు ఆశ్చర్యకరుడు, వయస్సు లేనివాడు, సర్వాంతర్యామి, మరియు సర్వశక్తి మంతుడు, సర్వజ్ఞుడు. ఆయనకు పరిధులు లేవు. యెషయా 40:25,26 వచనాల్లో ఆయన తన్ను గూర్చి ఇట్లు చెప్పుకొనుచున్నాడు. "నీవు ఇతనితో సమానుడవని మీరు నన్నెవనికి సాటి చేయుదురు? అని పరిశుద్ధుడడుగుచున్నాడు. మీ కన్నులు పై కెత్తిచూడుడి. వీటిని ఎవడు సృజించెను? వీటి లెక్కచొప్పున వీటి సమూహములను బయలుదేరజేసి వీటన్నిటికిని పేరులు పెట్టి పిలుచువాడేగదా. తన అధిక శక్తి చేతను తనకు కలిగియున్న బలాతిశయము చేతను ఆయన ఒక్కటియైనను విడిచి పెట్టడు".

మానవుని వలె దేవుడు అనిశ్చయుడు, అస్థిరుడై యుంటే ఈ ప్రపంచము భయంకరమైనట్టిదై యుండును. అందుకే "నేను మీ మధ్య పరిశుద్ధ దేవుడను గాని మనుష్యుడను కానని" ఆయన సెలవిచ్చుచున్నాడు (హోషేయ 11:9). "సైన్యముల కధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు. సర్వలోకము ఆయన మహిమతో నిండి యున్నది" (యెషయా 6 : 3). ఆయన పరిమితి లేనివాడు, నిత్యుడు, మార్పు జెందనివాడు గనుక ఆయన సృష్టించిన సృష్టికి ప్రత్యేకంగా యుండువాడు.

దేవుని గూర్చి ఆలోచించడం, ఆయనను ధ్యానించడం కంటే మానవుడు చేయగలిగిన ఉత్కృష్టమైన పని మరి యొకటి ఉండదు. దేవుడు ఆశ్చర్యకరుడు గనుక ఆయనను గూర్చి యున్న సంగతులన్నిటిలోను ఆయన తత్వం ప్రతిబింబించుచున్నది.

## ఆశ్చర్యకరమైన కుమారుడు

యేసుక్రీస్తు దేవుని ఆశ్చర్యకరుడైన కుమారుడు. ఆయన సాటిలేనివాడు. మత్తయి 16:16 లో క్రీస్తునుగూర్చి పేతురు ఒప్పుకొన్నది ఖచ్చితం, యధార్థం. "నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు ఆయనను గూర్చి ఒప్పుకొనెను. ఈ మాటలు మోషేను గూర్చి గాని, ఏలియాను గూర్చిగాని, బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చిగాని చెప్పబడలేదు. వారు మానవమాత్రులే గాని సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తుకారు, నజరేయుడైన యేసుక్రీస్తు ఒక్కడే దేవుని అద్వితీయకుమారుడైన క్రీస్తు.

యేసుక్రీస్తు ఎంతో ఆశ్చర్యకరుడు. ఆయన ఎన్నడు ఒక పుస్తకమైనను వ్రాయలేదు. ఆయన వంగి నేలమీద ఏదో వ్రాసినట్లే రికార్డు ఉన్నది గాని ఆయన ఒక పుస్తకంగాని పత్రిక గాని వ్రాయలేదు. అయినను ప్రపంచములో

యున్న గ్రంథాలయాలన్నీ ఆయనను గూర్చి వ్రాయబడిన పుస్తకాలతో నిండి యున్నవి. ఆయన ఎన్నడు ఒక పాటను గాని, పద్యాన్నిగాని వ్రాసి యుండలేదు.అయినను ఆయనను గూర్చి వ్రాయబడినన్ని పాటలు, కీర్తనలు పద్యాలు మరెవనిని గూర్చి వ్రాయబడియుండలేదు. ప్రపంచంలోని కోట్లాది పద్యకారులకు కవులకు ఆయన జీవనం ఒక మనోహరకధనం, కావ్యం, ఆయన ఎన్నడు వైద్యం చేయలేదు. అయినను ప్రపంచంలోని వైద్యులందరి కంటే ఆయన విరిగిపోయిన జీవితాలను, ముక్కలైన హృదయాలను స్వస్థపర్చాడు. ఆయన ఎన్నడు ఒక రాజకీయ పార్టీని స్థాపించలేదు. అయినను అనేక దేశాలు ప్రజలు ఆయన చిత్తాన్ననుసరించి నడుకొనుటకు ప్రయత్నించుచున్నారు. ఆయన ఒక ప్రముఖ దేశాధినేత గాని, సైన్యాధిపతిగాని కాడు. అయినను ఈ ప్రపంచంలో ఆయన నామము నెరుగని వారెవరును లేరు. యిది ఆశ్చర్యంకాదా? ఎందరో మహాత్ములు ఈ పుడమికి వచ్చి వెళ్లారు. గాని యేసుక్రీస్తు నామం ఒక్కటే సజీవంగా నిలిచియున్నది, నిలిచియుంటాది. హేరోదు ఆయనను చంపలేకపోయాడు. అపవాది ఆయనను పరాభవం చేయలేకపోయాడు. మరణం ఆయనను మ్రింగలేకపోయింది. సమాధి ఆయనను పట్టజాలక పోయింది. ఆయనే నిత్యుడు, పరిపూర్ణుడు, పరమాత్ముడు.

## సాటిలేనివాడు

యేసు ప్రభువు ఒక్కడే సాటిలేని వాడు. సాటిలేని దేవుని కుమారుని ఆదర్శంగా జేసికొని జీవించు మానవుడు ధన్యుడు. నీజీవితంలో ఆయనకు చోటిచ్చిచూడు. నీజీవితం గొప్పమార్పు జెందుతాది. నీలో ప్రేమ సంతోషం సమాధానం ప్రతిబింబిస్తాయి. క్రీస్తును వెంబడించిన తరువాత అపొ. పౌలు తన జీవితంలో కలిగిన విశిష్ట మార్పును గూర్చి ఇట్లు చెప్పుచున్నాడు: "నేను క్రీస్తుతోకూడ సిలువ వేయబడి యున్నాను. ఇకను జీవించు వాడను నేను

కాను. క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నాకొరకు తన్ను తాను అప్పగించు కొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2:20).

## ఆశ్చర్యకరమైన గ్రంథం

బైబిలు ఆశ్చర్యకరమైన దేవుని గ్రంధము. పరిశుద్ధాత్మా వేశము వలన అది వ్రాయబడింది. దేవుని ఆశ్చర్యకరమైన కృపవలన అది నేటికిని నిష్కల్మషంగా మానవులకు దాచబడింది. లభించుచున్నది. బైబిలు వలననే ఒకానొక దినమందు మానవులందరు తీర్పు తీర్చబడదురు. "నన్ను నిరాకరించి నామాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు, నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పుతీర్చును" అని యేసుప్రభువు చెప్పారు (యోహాను 12:48). బైబిలును ఎవడు నాశనము చేయజాలడు. "ఆకాశమును భూమియు గతించును గాని, నామాటలు ఏమాత్రమును గతింపవు" అని ఆయన చెప్పెను (మత్తయి 24:35). బైబిలు మార్పు జెందనిది. (కీర్తన 119:89). అది విశ్వాసము జనింపజేయును (యోహాను 20:30,31). అసత్యాన్ని ఖండించును (2తిమో 4:2). అది మానవుని మార్గదర్శి (తీతు 2:11,12). దేవుని ఆజ్ఞను తిరస్కరించువాడు శిక్షనొందును. ఆజ్ఞవిషయమై భయభక్తులు గలవాడు లాభము పొందును (సామె 13:13).

దేవుడు ఆశ్చర్యకరుడు, ఆయన కుమారుడైన యేసుక్రీస్తు ఆశ్చర్యకరుడు, రక్షకుడు. ఆయన యిచ్చిన బైబిలు గ్రంధం ఆశ్చర్యకరమైన గ్రంధం. దేవుడు మానవులకు వ్రాయించి యిచ్చిన గ్రంధం. మనం పాపముల నుండి విముక్తి పొందాలంటే బైబిలు గ్రంథంలోని మాటలకు లోబడాలి. యేసుప్రభువని, రక్షకుడని, దేవుని కుమారుడని విశ్వసించాలి, మనపాపముల విషయమై మారు

మనస్సు పొందాలి. ఆయనను గూర్చి మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి. ఆశ్చర్యకరుడైన దేవుని మరణపర్యంతము నమ్మకంతో వెంబడించాలి.

--జాషువా గూటం

# దేవుని మహోన్నత గ్రంథము

## (God's Great Book)

బైబిలు అని పిలువబడే దేవుని మహోన్నత గ్రంథమును గూర్చి ఒక్కసారి పరిశీలించుదాము. బైబిలు అను పదమునకు "గ్రంధము" అని అర్థము. ఈ పదము దాని గొప్పదనమును, ప్రాముఖ్యతను తెలియజేయుచున్నది. బైబిలును పోల్చి చూసినప్పుడు కనబడుచున్నది ఏమంటే అది పేదవారికి ఒక విధిగానూ, రోగులకు స్వస్థత నిచ్చునదిగాను, ఆకలిగొన్నవారికి ఆహారము నిచ్చునది గాను తప్పిపోయిన వారికి దారి చూపునది గానూ, మరణించుచున్న వారికి "నిరీక్షణ" కల్పించునదిగానూ కనబడుచున్నది. అది క్రైస్తవ జీవితానికి మూలకారణమైయున్నది.

ఈ మహోన్నత గ్రంథము నిజానికి బైబిలు అనిగాని, పరిశుద్ధ గ్రంథము అనిగాని పిలువబడలేదు. మానవుడే దానికి ఆ పేరును కల్పించినాడు. ఈ గ్రంథము దానికదే దేవుని వాక్యముగా చెప్పబడుచున్నది (హెబ్రీ 4:12), లేఖనములుగ చెప్పబడుచున్నది (యోహాను 5:39) 'దైవోక్తులుగా" చెప్పబడు చున్నది (1పేతురు 4:11). ఇతర గ్రంథములతో దీనిని పోల్చి చూసినప్పుడు చాలా భిన్నమైన గ్రంథముగా కనబడును. ఇది దేవుని వాక్యమైయున్నది. ఇది పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడి వ్రాయబడినది. కొందరు వ్రాస్తూ తాము పరిశుద్ధాత్మ చేత నడుపబడి, ప్రేరేపింపబడినట్లుగా చెబుతారు. అందుచేత

మనము నిజమైన దేవుని వాక్యమును పొందియున్నాము. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతిసత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దేవాదేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2తిమోతి 3:16-17).

## గొప్ప గ్రంథాలయము

నిజానికి బైబిలు ఒక గొప్ప గ్రంథాలయము. అది కేవలము ఒక గ్రంథము మాత్రము కాదు. గానీ అది 66 గ్రంథముల సంపుటి. అది 1600 సం॥ల కాలములో 40 మంది విభిన్న గ్రంధకర్తల చేత వ్రాయబడినది. బైబిలు ముఖ్యముగా "పాత నిబంధన" "క్రొత్తనిబంధన" అను రెండు భాగములుగా విభజింపబడినది. పాత నిబంధనలో 39 గ్రంథములు, క్రొత్త నిబంధనలో 27 గ్రంథములు కలవు. పాత నిబంధనలోని మొదటి 5 గ్రంథములు ఆదికాండము, నిర్గమ కాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము, ద్వితీయోపదేశ కాండము అనునవి న్యాయశాస్త్రానికి చెందిన గ్రంథములు. యివి మోషే చేత ప్రేరేపింపబడి వ్రాయబడినవి. యెహోషువ, న్యాయాధిపతులు, రూతు, 1 సమూయేలు, 2 సమూయేలు, 1 రాజులు, 2 రాజులు, 1 దినవృత్తాంతములు, 2 దిన వృత్తాంతములు, ఎజ్రా, నెహెమ్యా, మరియు ఎస్తేరు అనునవి చరిత్రకు చెందిన గ్రంథములు. ఇది వాగ్దాన భూమికి చేరుకున్న తరువాత జరిగిన ఇశ్రాయేలీయులు సంతతికి చెందిన చరిత్ర. యోబు గ్రంథము, కీర్తనల గ్రంథము, సామెతలు, ప్రసంగి, పరమగీతము అనునవి కావ్యసంబంధమైన గ్రంథములు, ఇంక పాత నిబంథన యందు మిగిలియున్న గ్రంథములన్నియూ, ప్రవచనములే. ఈ గ్రంథములలో యెషయా నుండి, మలాకీ వరకు మనము క్రీస్తు రాకడ గురించి, ఆయన రాజ్యస్థాపన గురించి అనేక ప్రవచనములను చూస్తాము.

క్రొత్త నిబంధనలోని మొదటి 4 గ్రంథములు మత్తయి, మార్కు, లూకా, యోహాను అనునవి క్రీస్తు జీవితాన్ని వివరిస్తాయి. ఈ గ్రంథములు వ్రాయుటకు గల కారణమును యోహాను 20:30-31 లో చదివి తెలిసికొన వచ్చును. "మరియు అనేక యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి ఈ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును నమ్మి ఆయన నామమున జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను." వీటి తరువాత అపోస్తలుల కార్యములు అనునది చరిత్రకు చెందిన గ్రంథము. ఇది క్రీస్తు శకము మొదటి శతాబ్ధములో జరిగినటువంటి దేవుని సంఘము యొక్క స్థాపనను గూర్చియు, దాని అభివృద్ధిని గూర్చియు తెలియజేస్తుంది. ఇది నిజముగా మనము చదువ వలసిన ఆసక్తికరమైన గ్రంథము. దీనిలో " మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" అనిన యేసు యొక్క ఆజ్ఞకు లోబడి, అపోస్తలులు జరిగించిన క్రియలను తెలిసికొనవచ్చును. దీని తరువాత మనము 21 పత్రికలను చూడగలము. యివి అన్నియూ క్రైస్తవులకు వ్రాయబడినవి. వీటిలో కొన్ని సంఘములనుద్దేశించి వ్రాయబడినవి. వీటిలో 14 పత్రికలను అపోస్తలుడైన పౌలు వ్రాసెను. యాకోబు ఒకటి, పేతురు రెండు, యోహాను మూడు, యూదా ఒకటి పత్రికలను వ్రాసెను. క్రైస్తవజీవితము ఏ విధముగా జీవించవలెనో తెలియజేయుట కొరకు యివి వ్రాయబడెను. ఒక అపోస్తలుల కార్యములనబడిన గ్రంథము పాపి రక్షింపబడటానికి ఏమి చేయవలెనో తెలియజేయటానికి 21 యితర గ్రంథములు కలవు, చివరగా ప్రకటనలనబడిన గ్రంథము క్రొత్త నిబంధనలో చాలా మట్టుకు ప్రత్యేకమైన రీతులుగా వ్రాయబడినది. ఒక సంకేతము మాదిరిగా కనబడుతుంది. సాతాను, అతని సహచరులపై క్రీస్తు మరియు ఆయన సంఘము యొక్క అంతిమ విజయమును తెలియజేస్తు శ్రమలకాలంలో మనకు స్ఫూర్తినిచ్చే ఒక సందేశము వలె ఈ

గ్రంథము కనబడుచున్నది. అదే విధముగా పరలోక రాజ్యము ఎంత సుందర మైనదో, మన కళ్ళకు కట్టినట్లు ఈ గ్రంథము చూపుతుంది.

బైబిలు మన జీవితంలో వెలకట్టలేనంత గొప్ప ఆస్థియైయున్నది. మనము దానిని చదువుచున్నప్పుడు శ్రద్ధతోనూ, ప్రార్థన పూర్వకముగానూ, నమ్మకమైన హృదయముతోనూ చదువుదము.

-- రోయ్‌బీస్లే

## శ్రేష్టమైన నామము

## (That Worthy Name)

యాకోబు వ్రాసిన పత్రిక రెండవ అధ్యాయము నందు యాకోబు తనను తాను దేవుని యొక్కయు, ప్రభువైన యేసుక్రీస్తు యొక్కయు దాసునిగా యెంచుకొని, క్రీస్తునందుండి చెదరి పోయియున్న తన సహోదరులనుద్దేశించి వారి యొక్క ఐక్యత కొరకు వ్రాసిన విషయమును మనము తెలిసికొనగలము. (యాకోబు 2:1-7).

"నా సహోదరాలారా, మహిమా స్వరూపి యగు మనప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన విశ్వాస విషయములో మోమాటము గల వారైయుండకుడి. ఏలయనగా ఒకడు బంగారు ఉంగరము పెట్టుకొని ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన యెడల, మీరు ప్రశస్త వస్త్రములు ధరించు కొనిన వానిని చూచి సన్మానించి నీవిక్కడ నిలువుము, లేక ఇక్కడనా పాద పీఠమునకు దిగువను కూర్చుండుమని చెప్పిన యెడల మీమనస్సులో బేధములు పెట్టుకొని మీరు దురాలోచనతో విమర్శ చేసిన వారగుదురు కారా? నాప్రియ సహోదరులారా, ఆలకించుడి, ఈ లోక విషయములో దరిద్రులైన వారిని విశ్వాసమందు భాగ్యవంతులు గాను తన్ను ప్రేమించు వారికి తాను వాగ్దానము చేసిన రాజ్యమునకు వారసులుగాను

ఉండుటకు దేవుడేర్పరచుకొనలేదా? అయితే మీరు దరిద్రులను అవమాన పరచుదురు. ధనవంతులు మీ మీద కఠినముగా అధికారము చూపుదురు, మిమ్మును న్యాయ సభలకు ఈడ్చుచున్న వారు వీరే గదా? ! మీకు పెట్టబడిన శ్రేష్ఠమైన నామమును దూషించు వారు వీరే గదా? "(యాకోబు 2:1-7).

## ప్రత్యేక నామము

దీనిని బట్టి ఋజువగు చున్న సత్యమేమనగా శిష్యులు, అపోస్తలులు, జీవించుచున్న క్రొత్త నిబంధన కాలమందు క్రీస్తును అనుసరించు వారందరును ఒక ప్రత్యేక నామముతో పిలువబడిరి. అది ఒక శ్రేష్ఠమైన నామము. ఆ నామమొక మహోత్తర శక్తిని, విలువను ప్రాముఖ్యతను కలిగి యున్న నామము. అది ఏ నామమై యుంటుందని నీ ఉద్దేశము? మెదడిస్టు నామమా? బాప్టిస్టునామమా? ఆంగ్లికన్ నామమా? లేక లూధరన్ నామమా? కథోలిక్ నామమా? లేక ప్రొటస్టాంట్ నామమా? కానేకాదు దేవుడు తన స్వరక్తమిచ్చికొని యున్న తన ప్రజలకు పైన పేర్కొన్న సంఘ సంఘశాఖల ఏ నామమును ఇవ్వలేదు. ఏలయనగా ఈ నామములలో ఏ ఒక్కటియును అపోస్తలుల క్రొత్త నిబంధన కాలమందు ఉండి యుండలేదు.

## క్రైస్తవుడు అను నామము

అపోస్తలుల కార్యములు పదకొండవ అధ్యాయములో గల ఆ శ్రేష్ఠమైన నామమును గూర్చి సులభముగా అర్థము చేసికొనగలము: "అంతట బర్నబా, పౌలును వెదుకుటకు తార్సు అను పట్టణమునకు వెళ్ళి అతనిని కనుగొని అంతియొకయ అను పట్టణమునకు తోడుకొని వచ్చెను. వారు కలసి ఒక సంవత్సరమంతయు సంఘములో ఉండి బహుజనములకు వాక్యమును బోధించిరి.

మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి". అదియే శ్రేష్టమైన నామము (అ.పో 11:25,26). మరియు అపోస్తలుల కార్యముల గ్రంథములు 26వ అధ్యాయమునందు అపోస్తలుడైన పౌలు అగ్రిప్పరాజుకు క్రీస్తును గురించి బోధించిన ఉదంతము కలదు. పౌలు చెప్పిన మాటలను చక్కగా వినిని రాజు ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే అని పౌలుతో చెప్పెను. (అ.పో 26:28). మరియు పేతురు వ్రాసిన మొదటి పత్రిక నాల్గవ అధ్యాయము గమనించగలము: "క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైన యెడల మహిమా స్వరూపియైన ఆత్మ, అనగా దేవుని ఆత్మ, మీమీద నిలుచుచున్నాడు గనుక మీరు ధన్యులు, మీలో ఎవడైనను నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరుల జోలికి పోవువాడుగా గాని బాధ అనుభవింప తగదు. ఎవడైనను, క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను (1 పేతురు 4:14-16).

కాబట్టి క్రొత్త నిబంధన కాలమందు శిష్యులు, మన రక్షకుడైన యేసు క్రీస్తు అనుచరులు "క్రైస్తవులు" అను శ్రేష్టమైన నామము తోనే పిలువబడిరని నిస్సందేహముగా అర్థమగు చున్నది.

సాధారణంగా మనుష్యులకు కలుగు శోధన తప్పమరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు మీరు సహింపగలిగినంత కంటె ఎక్కువగా ఆయనమిమ్మును శోధింపబడనియ్యడు. అంతేగాదు; సహింప గల్గుటకు ఆయన శోధనతో కూడ తప్పించు కొను మార్గమును కలుగ జేయును. (1 కొరింధి 10:13).

మరి నీవేమని పిలువబడుచున్నావు? నీవు ఈ రోజున అత్యశ్రేష్టమైన నామముతో పిలువబడుచున్నావా? లేని యెడల అత్యశ్రేష్టమైన నామమును ధరించుటకు ప్రయత్నించుము.

--సన్నిడేవిడ్, న్యూఢిల్లీ

## సంఘ పెద్దలను గూర్చి గమనించ వలసిన విషయములు

**(Things to Consider Concerning the Eldership of the Church)**

క్రీస్తు సంఘమును స్థాపించియున్నాడు (మత్తయి 16:18). ఆయనే దానికి శిరస్సై యున్నాడు గాని (ఎఫెసీ 1:22,23), ప్రతిస్థానిక సంఘము దాని పెద్దలను, పరిచారకులను కలిగియుండాలని క్రొత్త నిబంధనలో ఆయన హెచ్చరికల నిచ్చి యున్నాడు (1తిమోతి 3, తీతు1). పెద్దలను గూర్చి మనం అనేక సంగతులను గమనించ వలసియున్నది.

1. ప్రతి స్థానిక సంఘము పెద్దలను కలిగి యుండాలి. వారు ఏ స్థానికి సంఘానికి పరిచర్య చేయుదురో ఆ స్థానిక సంఘ సభ్యులై యుండాలి.

2. పెద్దలుగా నియమింపబడుటకు స్థానిక సంఘములో కనీసము యిద్దరు అర్హత గల పురుషులుండాలి. అర్హతగల పురుషుడు ఒక్కడే యున్నట్లయితే ఆతనిని నియమింపరాదు. అట్టి సందర్భాల్లో స్థానిక సంఘములోని పురుషులు సంఘవ్యవహారాలను చక్కబెట్టవలెను. అర్హతగల పురుషులు సంఘములో ఏర్పడేవరకు యిది కొనసాగింపబడవలెను. అర్హత లేనివారిని పెద్దలుగా నియమిస్తే దుష్పరిణామాలు సంభవిస్తాయి. అట్టి వారిని ఆ పదవి నుండి తొలగించుట దుర్లభమగును.

3. పెద్దలకు అర్హతలు ప్రకటింపబడ్డాయంటే, వారి యొక్క పనిని

గూర్చి, పదవిని గూర్చి దేవుని దృష్టిలో గల ప్రాముఖ్యత ఎక్కువ యని మనం గ్రహించుకోవచ్చును.

4. లేఖనాల్లో పెద్దలు బిషప్పులని, ప్రెస్బిటరులని, కాపరులని, పాస్టర్లు అని, పర్యవేక్షకులని పిలువబడ్డారు. ఇవన్నీ వారు చేసే పనిని వర్ణించునవి మాత్రమే. అయితే లేఖనాల్లో వీటిని బిరుదులుగా తగిలించుకొన్నవారెవరు మనకు కనబడరు. ప్రతిస్థానిక సంఘములోను ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది మనకు కనబడుదురు.

5. 1తిమోతి 3వ అధ్యాయములోను, తీతు మొదటి అధ్యాయములోను చెప్పబడిన అర్హతలను బట్టి అట్టి వారిని స్థానిక సంఘమే పెద్దలుగా నియమింతురు.

6. పెద్దలుగా యుండు వారు ఏక పత్నీ పురుషులును, విశ్వాసులైన పిల్లలుగలవారునై యుండాలని చెప్పబడింది. ఇంకో మాటలో కుటుంబ యజమానులుగా వారు అనుభవము సంపాదించిన వారై యుందురు. వారు తమ యింటి వారిని ఏలనేరకపోయిన యెడల దేవుని సంఘమును ఏలాగుపాలింతురు? అని అపో. పౌలు ప్రశ్నించాడు (1తిమో 3:5).

7. వారు విశ్వాసులైన పిల్లలను కలిగి యుండాలని, అంటే ఒకరిద్దరు పిల్లలను కలిగి యుండాలని పౌలు యొక్క భావము (1తిమో 3:4). ఒకే ఒక్కడుంటే సరిపోతాదని కొందరు వాదిస్తారు. ఒకరి కంటే ఎక్కువ పిల్లలను పెంచుట ఎట్లో ఎక్కువమంది పిల్లలను కలిగిన తండ్రికి అనుభవముండును. పిల్లలు వేర్వేరుగ యుంటారు. మరియు వారివారి వ్యక్తిత్వాలను బట్టి వారిని సరిగా నడిపించాలి. తండ్రిగా యిట్టి అనుభవము కలిగిన వాడు వివిధ తత్వాలు కలిగిన సంఘ సభ్యులను చక్కగా నడిపించగలడు. ఒకనికి ఒకే ఒక్క సంతతి

యున్నట్లయితే సంఘాన్నంతటినీ ఈ ఒక్క పిల్లవాని వలె నడిపించవచ్చు ననుకొంటాడు.

8. పెద్దయైన వాడు యితరులకు బోధింప తగినవాడై యుండాలి. మరియు బహిరంగముగా బోధింపతగినవాడై యుండాలి. సంఘాన్నంతటికీ బోధించుటకు, ఉపదేశించుటకు అతడు సంసిద్ధుడైయుండాలి. ఈ అర్హతలేని వాడు సంఘాన్ని సరిగా నడిపించలేడు.

9. పెద్ద యైనవాడు క్రొత్తగా చేరినవాడు కాకూడదు. ఒకడు క్రైస్తవుడు కాగానే పెద్దగా నియమింపబడితే ఆత్మీయ విషయాల్లో అతడు ఘోరమైన పొరబాట్లు చేయవచ్చును. నేనే ప్రముఖుడనని తలంచవచ్చును. గర్వించవచ్చును. విశ్వాసములో పెరుగుటకు, దేవుని వాక్యజ్ఞానము సంపాదించుకొనుటకు, ప్రభువు పనిచేయుటకు ఒకనికి సమయము అవసరము. ఈ విషయాల్లో పెరుగుటకు సమయము లేనియెడల ఒకడు మంచి మాదిరిని నెలకొల్పలేడు, జ్ఞానయుక్తముగా ప్రవర్తింపలేడు.

10. మిగిలిన అర్హతలు అతని వ్యక్తిగత జీవితాన్ని గూర్చినట్టివి. తన తోటి క్రైస్తవులతోను, పొరుగువారి తోను యుండు సంబంధమును గూర్చిన యట్టివి. అతడేమి బోధించుచున్నాడో దానినే అనుసరించుచు క్రీస్తుననుసరించు వానిగా తనజీవితమును సంపూర్తిగ అదుపులో యుంచుకోవాలి. క్రీస్తులో తన సోదర సోదరీలను గూర్చి ఆసక్తి కలిగి యుంటూ యితరులకు సువార్త నందించుటకు ముందుకు కొనసాగాలి.

11. పురుషులు మాత్రమే పెద్దలుగా యుండాలి. పెద్దల భార్యలు కూడ ప్రాముఖ్యమైన పాత్రను వహించువారే. వారు భక్తిగల కుటుంబమును, బిడ్డలను కలిగి యుండుటకు దోహదపడుదురు. యిది దేవుడు ఏర్పాటు చేసిన విధానము. మానవునికేది శ్రేష్టమో ఆయనే ఎరుగును.

12. పెద్దలు సంఘముపై "ప్రభువులైనట్లుండరాదు." సభ్యులను బలవంత పెట్టువారైయుండకూడదు. సరిగదా సభ్యులయెడల ప్రేమకలిగి, మంచి మాదిరి నెలకొల్పుచు సంఘమును నడిపించాలి (1పేతురు 5:3).

13. సంఘములో బోధకునిగాని లేదా మరింకొకని గాని ప్రభువు ఒక నియంతగా తయారవ్వాలని కోరలేదు. ఆలాగే పెద్దలు సంఘముపై ప్రభుత్వము చేయాలని, నియంతలుగా యుండాలని ఆయన ఉద్దేశ్యము కాదు. పెద్దలందరు సమానాధికారముగలవారే, వారు ఒండొరులతో కలసి పని చేయుట నేర్చుకోవాలి.

14. పెద్దలు సంఘమును లేక మందను కాయువారు, పోషించువారు. (అపో.కా.20:28, 1పేతురు 5:2).

15. స్థానిక సంఘములో పెద్దలలో ఒకనిగా యుండుటకంటె గొప్పపదవి యేమీ లేదు. ఒకడు అర్హతగలవాడైయుండి దేవునిపని చేయుచున్నయెడల యిది గొప్పఘనత. అయితే ఈ పదవితో రాజకీయ పలుకుబడిగాని ఆర్థిక లాభముగాని యేమీవుండదని గ్రహించుకొనాలి. దేవుని చిత్తమును జరిగించుటకు, సంఘమునకు పరిచర్య చేయుటకు పెద్దలు అవసరము.

నీవు క్రీస్తు సంఘములో నమ్మకమైన సభ్యుడవైతే, పైన చెప్పబడిన అర్హతలు నీకున్నయెడల మీ స్థానిక సంఘము నిన్ను పెద్దలలో ఒకనిగా నియమించవచ్చును. నీవుగాని, యితరులెవరైనా గాని పరిపూర్ణులు కారు, కాలేరు. అయితే దేవుడు నియమించిన అర్హతలను పెంపారు జేసికొనుచు, నమ్మకముగా జీవిస్తు, విశ్వాసములో ఎదుగుచు ప్రభువు యొక్క సారూప్యములోనికి రాగలవు. నీవు పెద్దలలో ఒకనిగా నుండగోరుచున్నయెడల దేవుని గ్రంధాన్ని విడువక చదువు, పెద్దగా నియమింపబడు తరుణముకొరకు సిద్ధపడు. దేవుడు నిన్ను తప్పక దీవిస్తాడు.

-- జె.సి. ఛోట్

# దేవుని పరిశుద్ధ యాజకులు

## (God's Holy Priesthood)

" మనలను ప్రేమించుచు తన రక్తము వలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగునుగాక, ఆమేన్. ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులను గాను జేసెను" (ప్రకటన 1:6).

మొదటి శతాబ్దములోని యూదులు రెండు వివిధములైన ఆత్మీయ చట్టములను బట్టి జీవించవలసి వచ్చెను. వారు మోషే ధర్మశాస్త్ర ప్రకారము జీవించుచు, దేవాలయము దగ్గర బలులు అర్పించుట, ఆయా పండుగలు ఆచరించుట, యాజకుల ద్వారానే దేవుని సన్నిధికి చేరుట, మరియు మోషే ద్వారా ఇశ్రాయేలీయుల కీయబడిన ఆజ్ఞలను పాటించుట వగయిరాలు చేసేవారు. అయితే క్రీస్తు పునరుత్థానుడైన మొదటి పెంతెకొస్తునాడు క్రైస్తవ్యము యెరూషలేములోనే ఆరంభమాయెను. కొందరు యూదులు క్రీస్తును వెంబడించి ఆయన సంఘముగా నుండుటకు నిశ్చయించుకొనినందున, వారు మోషే ధర్మశాస్త్రమును విడిచి వారు దేవునితో నూతన ఒడంబడికలో ప్రవేశించి నూతన ఆజ్ఞలకు బద్ధులైరి. క్రొత్త నిబంధన క్రైస్తవులుగా వారు విశ్వాసమును బట్టి నడుతురు. క్రీస్తు చిత్తమునననుసరింతురు మరియు క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరము వలె ఆయనను ఆరాధిస్తూ సేవింతురు.

మోషే ధర్మశాస్త్రము నుండి యూదులు క్రైస్తవ్యములోనికి మార్పుజెందినప్పుడు దేవుని సేవించుటలో యాజకులుగా ప్రత్యేకింపబడిన గోత్రము వారు ఎవరు లేరుగాని అందరూ యాజకులే యను సత్యమును వారు గొప్పగా గ్రహించారు. క్రొత్త నిబంధన ప్రకారము ఎవరైతే క్రీస్తు రక్తములో కడుగ బడ్డారో వారందరినీ ఆయన తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను,

యాజకులను గాను చేసెను (ప్రకటన 1:6). క్రీస్తులో మనము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నాము. (1 పేతురు 2:9). మనము "యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడియున్నాము" (1 పేతురు 2:5). క్రైస్తవులందరు యాజకులే అను సత్యమును మనందరము తప్పక గ్రహించ వలసి యున్నది. యూదుల యుగంలో లేవీయులను దేవుడు యాజకులనుగా జేసెను. క్రైస్తవయుగంలో క్రీస్తు సువార్తకులోబడిన ప్రతి స్త్రీని పురుషుని దేవుడు యాజకులనుగా జేసి ఘనపరచి యున్నాడు. ఈ గొప్ప సత్యాన్ని మరింతలోతుగా పరిశింతము.

## దేవుని నుండి కలిగిన యాజకత్వపు ఘనత

క్రైస్తవులైనవారు యాజకత్వపు ఘనతను పొంది యున్నావారు, వారితో ఒక ప్రత్యేక సంబంధమును నెలకొల్పి దేవుడు వారిని ఘన పరచాడు. మోషే కాలపు యాజకులకు దేవునితో ఒక ప్రత్యేక సబంధము ఏర్పరచబడింది. మిగతా ఇశ్రాయేలీయుల వలెగాక వారు దేవుని సన్నిధానమున నిత్యము జీవించుచు యుండేవారు. ఇశ్రాయేలీయులు తమ గుడారములను ఎక్కడ వేసినా, యాజకుల గుడారములు మాత్రము ప్రత్యక్షగుడారమునక్కు ఎదురుగా, దేవుని ప్రత్యక్షతకు ఎదురుగా యుండేవి. ఇశ్రాయేలీయులు కానానులో స్థిరపడినప్పుడు, యాజకులు భూమిని గాక దేవుని తమ స్వాస్థ్యముగా పొందియుండిరి. తాము నివసించుటకు లేవీయులు 48 పట్టణములను వాటి చుట్టు యున్న పంట భూములను పొంది యుండిరి, నిజమే (యెహోషువ 21:41). గాని వారు తమ సమయాన్ని సంపూర్తిగ దేవుని కిచ్చుటకు గాను

మిగతా గోత్రములవారు వారిని సంరక్షించిరి. ప్రత్యక్ష గుడారము దగ్గర అర్పింపబడిన బలులన్నియు ఇశ్రాయేలీయుల కొరకు ఒక యాజకుడు అర్పించేవాడు. ఈ యాజకులను దేవుడు ప్రత్యేక పరచెను.

పాతనిబంధన కాలములో దేవునితో కలిగియున్న ఈ సన్నిహిత సంబంధమును దేవుడు క్రైస్తవ యుగంలో క్రైస్తవులకనుగ్రహించాడు. సువార్త ద్వారా దేవుని యొద్దకు వచ్చు వాడెవడైనను ఆయన కుటుంబముతో చేర్చబడి ఆయన సొత్తుగా పరిగణించబడును (తీతు 2:14). ఒకప్పుడు ఆయన ప్రజలుకాని వారు ఇప్పుడు క్రీస్తు రక్తమువలన క్రీస్తు ద్వారా సమీపస్థులయ్యారు (ఎఫెసీ 2:13, 17). దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్ముడు మనలో జీవించుదురు (యోహాను 14:23; ఎఫెసీ 3:17, కొలస్స 1:27; 1కొరింథీ 6:9,20). అనుదినం మనము తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు సహవాసములో నడుచుకొందుము (1 యోహాను 1:3; రోమా 8:5).

## దేవుని యొద్దకు యాజక మార్గము

క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరములో అవయవములైన వారికి దేవుని యొద్దకు చేరే యాజక మార్గము కలదు. దేవుని సన్నిధానమునకు చేరుటకు మనం ఏమానవుని మధ్యవర్తిత్వము ద్వారా వెళ్లనవసరం లేదు. యూదులు మానవ మాత్రుడైన ఒక యాజకుని ద్వారా మాత్రమే దేవుని చేరుకోగలిగేవారు. ఒక యాజకుని ద్వారా గాని, ప్రవక్తద్వారా గాని దేవుడు యూదులతో మాట్లాడేవాడు. మరియు యాజకుని ద్వారానే యూదులు బలుల నర్పించేవారు.

క్రైస్తవ యుగంలో క్రైస్తవుడైన ప్రతివాడు క్రీస్తు ద్వారా దేవుని యొద్దకు చేరుకొనగలడు. యూదులకు అన్యజనులకు కూడ దేవునికి మానవునికి మధ్యగల అవాంతరములన్నియు సిలువ వలన నాశనము చేయబడినవి.

"ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేరగలిగియున్నాము" అని పౌలు చెప్పెను (ఎఫెసీ 2:18). మరల " ఆయన యందలి విశ్వాసము చేత ధైర్యమును నిర్భయమైన ప్రవేశమును ఆయనను బట్టి మనకు కలిగియున్నవి" యని అతడు చెప్పెను (ఎఫెసీ 3:12). క్రైస్తవుడు దేవుని యొద్దకు వచ్చుటకు క్రీస్తు ఒక్కడే మధ్యవర్తియైయున్నాడు. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే, ఆయన క్రీస్తు యేసను నరుడు" (1తిమో 2:5).

మోషే యుగంలో యూదులు నేరుగా దేవుని చేరుకొనే మార్గము లేక పోయింది. వారు లేవీ యాజకుల ద్వారా దేవుని చేరుకొనేవారు. దేవుడు నిరంతరం వారికి సహకారిగా యున్నా వారాయనను చేరుకొనే మార్గము మానవ యాజకులకే పరిమితం చేయబడింది. ఇప్పుడైతే క్రీస్తు ద్వారా దేవుడు ప్రతివానిని తన సన్నిధానమునకు ఆహ్వానించుచున్నాడు. ఆయన సహవాసమును మనం కలిగియుంటూ తండ్రి బిడ్డల యొక్క సంబంధమును సంతోషముతో అనుభవించాలని ఆయన కోరుచున్నాడు. ప్రార్థనతోను, ఆత్మీయమైన పరిచర్యతోను ఈ సహవాసమును అనుభవింతముగాక.

## దేవుని కొరకు యాజక ధర్మము

క్రైస్తవుల వలె మనకొక యాజక ధర్మమున్నది. మనం యాజకుల పనిని జరిగింతుము. పాతనిబంధన కాలంలో ఇశ్రాయేలీయులందరి కొరకు యాజకులు దేవునికి బలుల నర్పించేవారు. దేవునికి ఆరాధన జరిగించునప్పుడు యాజకులు మాత్రమే పరిశుద్ధ స్థలములో ప్రవేశించేవారు. పరిహారార్థ బలిదినమున ప్రధాన యాజకుడు ఒక్కడు మాత్రమే అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించి ప్రజలందరి నిమిత్తము సంవత్సరానికి ఒక్కసారి పాప పరిహార్థ బలి నర్పించేవాడు. ఆరాధన

సంబంధమైన ఈ బాధ్యతలే గాక, యాజకులు ఇశ్రాయేలీయులందరికీ దేవుని ధర్మశాస్త్రమును బోధించు బాధ్యత కలిగి యుండిరి.

క్రైస్తవ యుగంలో జంతుబలులేమీ అర్పించబడనవసరం లేదు. గాని పాటలు పాడుట, ప్రార్థన చేయుట, ప్రభురాత్రిభోజనము నాచరించుట, కానుకల నిచ్చుట, దేవుని వాక్యోపదేశము జరిగించుట యను ఆత్మీయ ఆరాధనలో ప్రతి క్రైస్తవుడు పాల్గొనును. "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతి యాగము చేయుదము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). పరిశుద్ధుల ప్రార్థనలు సువర్ణ ధూపార్తిపైనుండి లేచు ధూపముతో ప్రకటనల గ్రంధములో పోల్చబడినవి (ప్రకటన 8:3). యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటయే క్రీస్తు సంఘము యొక్క ముఖ్య విధియైయున్నది (1 పేతురు 2:5).

"సహోదరులారా, యేసు మన కొరకు ప్రతిష్ఠించిన మార్గమున, అనగా నూతనమైనదియు, జీవముగలదియు ఆయన శరీరము అను తెర ద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలమందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను, దేవుని యింటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను, మనస్సాక్షికి కల్మషముతోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములు గలవారమును నిర్మలమైన ఉదకముతో స్నానముచేసిన శరీరములు గలవారమునైయుండి, విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యధార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము" (హెబ్రీ 10:19 - 22).

యేసు క్రీస్తు మన ప్రధాన యాజకుడు. మరియు ప్రతి క్రైస్తవుడు దేవుని యొద్దకు ఎప్పుడైనా ఎక్కడైనా చేరుకోగల యాజకుడు. మన రక్షకుడు తన

స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను (హెబ్రీ 9:12). అందువలన క్రైస్తవులు దేవుని కృపను మానవాళికంతటికీ ప్రకటించాలని ఆజ్ఞాపింపబడిరి (మార్కు 16:15,16).

## ముగింపు

క్రైస్తవులు దేవుని పరిశుద్ధ యాజకులై యున్నారు. మనకు యాజకత్వపు ఘనత, ప్రవేశము, యాజక ధర్మము అను గ్రహించబడియున్నది. యెహోవా దేవుని ప్రజలుగా మనము ప్రత్యేకింపబడ్డాము. మన పిలుపు గొప్పది. పరిశుద్ధులుగా యుండుటకు దేవుని వలె యుండుటకు మనము పిలువబడ్డాము. మన పని గొప్పది. అది దేవుని యొక్క యాజకుని పని.

నీవు క్రైస్తవుడవా? క్రీస్తు నీ పాపములు కడుగునట్లును నిన్ను దేవునికి యాజకునిగా చేయునట్లును సమ్మతించావా? యేసు ప్రభువునందు విశ్వాసముంచు, నీ పాపముల విషయమై మారు మనస్సు పొందు, పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందు. క్రైస్తవుడవు కమ్ము. దేవుని యాజక ధర్మము నిర్వర్తించుము.

-- ఎడ్డీ క్లోర్ (Tft)

---

తెలుగు, ఇంగ్లీషు, ఒరియా భాషలలో ఇప్పుడు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు మావద్ద లభ్యమగుచున్నది. వలయువారు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి

**DIRECTOR**

**Bible Correspondense Cource**

**P.O.Box No. 80, KAKINADA - 533 001.**

---

# క్రీస్తు సంఘమును గూర్చి తెలుసుకొనుట మంచిది

ప్రియసహోదరులారా! క్రీస్తు సంఘమును గూర్చి మనమందరమూ తెలుసుకొనుట బహు అవసరము. ఎందుకనగా నేడు సంఘమును గూర్చి అనేక అభిప్రాయములు, వివాదములు కల్గుచున్నవి. నేడు ఉన్న మత శాఖల వలన అనేక మంది ఏది నిజమైన సంఘమో తెలుసుకొనలేక పోవుచున్నారు. ఈనాడు సత్యసంఘమును అన్వేషించువారు కొందరే ఉన్నారు. మీరునూ అట్టి అన్వేషణలో ఉన్నట్లయితే మీ అన్వేషణ మానవుల సిద్ధాంతములను ఆధారము చేసుకొనక, అబద్దబోధలపై ఆధారపడక పరిశుద్ధ గ్రంథమునుండి ప్రారంభించ ప్రార్థన.

క్రీస్తు సంఘమునకును ఈ దినములలో మన గ్రామములలో, పట్టణములలో కన్పించుచున్న అనేక మతశాఖలకును చాలా వ్యత్యాసమున్నది. ఈనాడు అనేక మంది దైవ వాక్కు సెలవిచ్చిన సంఘమును గూర్చి చాలా నిర్లక్ష్యముగా ఉన్నారు. సంఘమనగా వారి దృష్టిలో నాలుగు గోడల కలయిక లేక నాలుగు తడికెల కలయికయే యని ఆలోచించుకొనుచున్నారు. సంఘము యొక్క ఆత్మీయ అర్థమును గ్రహించకున్నారు. సంఘము యొక్క ఉద్దేశ్యం, సంఘము యొక్క విలువ, ఖ్యాతి, అందున్న శక్తి తెలుసుకొనలేక పోవుచున్నారు.

సంఘమనగా పిలువబడిన వారు అని అర్థం. ఇది ఎక్లేషియా అను గ్రీకు పదమునుండి పుట్టినది. మనలను పాపపు మార్గంనుంచి విడిపించుటకు

దేవుడు ఒకే మార్గమును లేక సంఘమును ఏర్పరచెను (ఎఫెసీ 4:4). మనలను క్రీస్తు ఒక్క శరీరముగా పిలచెను. ఆ శరీరమే ఆయన సంఘము. దానికి శిరస్సు క్రీస్తే (ఎఫెసీ 5:22). "ఆ శిరస్సు మూలముగా సర్వ శరీరము కీళ్లచేతను, నరముల చేతను పోషింపబడి అతుకబడినదై దేవుని వలన కలుగు వృద్ధితో అభివృద్ధి పొందుచున్నది (కొలస్స 2:19). "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు (కొలస్స 1: 17-18). సంఘము పట్ల క్రీస్తు చూపిన అమూల్యమైన ప్రేమను గూర్చి అపొస్తలుడైన పౌలు ఇట్లనెను. "సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నావంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను". (కొలస్స 1 : 24).

## సంఘము ఒకే ఒక్క నామమును కల్గియున్నది :

బైబిలును క్షుణ్ణంగా పరిశీలించినచో సంఘమును గూర్చి క్రొత్త నిబంధన యందు విపులంగా వివరించబడెను. సంఘము క్రీస్తు నామమును ధరించెను. అంతేకాని, కేథలిక్, బాప్టిస్ట్, సెవెంత్‌డే ఎడ్వెంటిస్ట్, రక్షణదళం, యెహోవాసాక్షులు, లూథరన్, ఎత్తబడే సంఘం, సత్యసువార్త మొదలగు పేర్లు ఎచ్చటను క్రీస్తు సంఘము కల్గియుండలేదు. క్రీ.శ. 33 లో పెంతుకొస్తు అను పండుగ దినమున యెరూషలేములో స్థాపించబడిన సంఘము క్రీస్తు శరీరం, క్రీస్తు సంఘం, పెండ్లికుమార్తె, దేవుని సంఘం అను పర్యాయపదములను కల్గియున్నది.

(ఎఫెసీ 1:22-23, రోమా 16:16, ఎఫెసీ 5:23-32, 1 కొరింథీ 1:2). ఇందలి విశ్వాసులు శిష్యులని, పరిశుద్ధులని, సహోదరులని, దేవుని పిల్లలని క్రైస్తవులని మాత్రమే పిలువబడిరి (యోహాను 15:8; రోమా 1:7; లూకా 8:21, 1 యోహాను 2:1, 1 పేతురు 4:16). ఇది పెద్దలను, పరిచారకులు ఉపదేశకులు, సభ్యులను కలిగియుండును. క్రీస్తు సంఘ ఆరాధన లేఖనములను అనుసరించి ఐదు అంశముల ద్వారా దేవుని స్తుతించును. ఆరాధనలో పాటలు, ప్రార్థన, బోధ, ప్రభురాత్రిభోజనం, కానుకలిచ్చుట అను అంశములుండును.

**సంఘమునకు వెలుపల రక్షింపబడరు :**

"రక్షణ పొందుచున్న వారిని అనుదినము ప్రభువు వారితో చేర్చుచుండెను' (అపొ.కా.2:47). సంఘమునకు వెలుపల నెవరునూ రక్షించబడరు. "ఎందుకనగా ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును'' (మత్త 7:21) అని చెప్పబడియున్నది.

ఒకడు దైవ చిత్తాన్ననుసరించి సంఘములో ఉన్నప్పుడే రక్షణ కలదు. దేవుడు సంఘము ద్వారా తనయొక్క నానా విధమైన జ్ఞానమును మనకు తెలియపర్చుచున్నాడు (ఎఫె 3:11). మానవ కల్పిత సంఘములలో ఎంత భక్తిగా, నీతిగా జీవించినను నరకముతప్పదు. ఎందుకంటె పాతాళలోక

ద్వారములు క్రీస్తుసంఘము ఎదుట నిలువ నేరవు.

కనుకనే క్రీస్తు సంఘములన్నియు ఒకే నిజవిశ్వాసమును ఒకే ఒక రాజ్యమును, ఒకే రాజును, ఒకే రాజ్యాంగమును కల్గియున్నవి. ఒకే ఆరాధన, ఒకే బాప్తిస్మము యున్నది. కనుక ప్రియమిత్రమా నీవు నీ విలువైన సమయాన్ని, జ్ఞానాన్ని మేధస్సును వృధా పరచక యేసుని గూర్చివిని, విశ్వసించి, మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొంది, నిజమైన క్రీస్తు సంఘసభ్యుడవు కావలెనని మిమ్మును కోరుచున్నాము. మనప్రభువైన యేసు క్రీస్తు కృప మనకందరకు తోడైయుండును గాక.

-- పి. చంద్రశేఖర్, కాకినాడ.


## క్రైస్తవ కీర్తనలు

**236** పాటలు గల క్రైస్తవ కీర్తనల పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక క్రొత్త పాటలు, సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న పాటలు చేర్చబడినవి. ఒక్కొక్క కాపీ వెలరూ॥ **12/-** మాత్రమే. పోస్టేజీ ఇంకొక రెండు రూపాయలు. వలయువారు ఈ దిగువ చిరునామాకు రూ॥**14/-** లు M.O. చేసి పొందండి:

**SATYAVANI,**
Samba Murthy Street,
Kakinada - 533 004.

# సంక్షిప్త వార్తలు

ఆగస్టు నెల సువార్తికులు సదస్సు 22వ తేదీ మంగళవారం మాకనపాలెంలో జరిగెను. అనేక ప్రాంతాలలో క్రీస్తు సువార్త ప్రక టించుచూ, ఆయన రాజ్యవ్యాప్తిలో శ్రమించుచున్న సువార్తికుల సమక్షంలో "క్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించుటలో యేమేమి యిమిడి యున్నవి?" (అపో. కా. 8 : 34-39) అను అంశము చర్చింప బడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు పాల్ గూటం గారు అధ్యక్షులుగాను మధ్యాహ్నం సోదరులు వి. చిన్నయ్యగారు అధ్యక్షులుగా నుండి చర్చ సమర్ధవంతముగ నడిపించిరి. సోదరులు K. జార్జి గారు, N. మోజెస్ గారు, N.J. మోహానరావు గారు, M. L. క్రిష్టాఫర్ గారు, Ch. జాన్‌బాబు గారు, V. చిన్నయ్య గారు, శ్యామ్ సలాంగారు (మణిపూర్) చర్చలో పాల్గొనిరి.

మణిపూర్ నుండి వచ్చిన సోదరులు శ్యామ్‌సలామ్‌గారు చక్కని సందేశాన్ని ఇవ్వడం మాత్రమేగాక మణిపూర్‌లో నున్న స్వయం పోషక క్రీస్తు సంఘములను గూర్చి వాటి గొప్ప పనిని గూర్చి, కలకత్తా నగరంలో వారు నడిపించుచున్న బైబిలు పాఠశాలను గూర్చి, విదేశీ సహాయం లేకుండ నేపాల్, బర్మా, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, సిక్కింలకు వారు మిషనరీలను పంపిన విషయం చెప్పి మార్గదర్శకమైన పని జరిగించగలుగునట్లు సహోదరు లను ప్రోత్సహించిరి. వారి రాక స్థానిక సంఘానికి సోదరులకు ప్రోత్సా హము కలిగించెను.

సువార్త అనగా క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములు (1 కొరి 15:1-4). సువార్తికుడైన ఫిలిప్పు ఐతియోపీయునికి "క్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించెను". సువార్త వినిన ఐతియోపీయుడు "నాకు బాప్తి స్మమిచ్చుటకు ఆటంకమేమి?" అని ఫిలిప్పును ప్రశ్నించెను. ఫిలిప్పు క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములతో పాటు బాప్తిస్మమును గూర్చి ప్రకటించెను.

బాప్తిస్మము అవసరము లేదని ప్రకటించే వారు క్రీస్తు ఆజ్ఞను నిరాకరించుచున్నారు. సువార్త వినిన ఐతియోపీయుడు బాప్తిస్మము పొంది సంతోషించుచు వెళ్లెను. క్రీస్తు మనకొరకు సిలువపై మరణించెనని ప్రకటించునప్పుడు ఆ సిలువ రక్తముతో సంఘమును ఆయన సంపాదించెనని (కొనెనని) ప్రకటించాలి. ఆయన దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను. క్రీస్తు సువార్తలో ఆయన మరణ, సమాధి, పునరుత్థానములు, విశ్వాసము, మారు మనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము ఆయన సంఘములో మరణము వరకు నమ్మకముగా నుండుట అనే అంశాలు యిమిడి ఉన్నాయి.

బాప్తిస్మము పొందకపోతే రక్షణ లేదు. రక్షణ లేని సువార్త భిన్నమైన సువార్తయే. సువార్త ప్రకటించువారు దేవుని సంకల్పాన్ని సంపూర్ణముగా వాక్యానుసారంగా బోధిస్తేనే దేవునికి యిష్టమైన సువార్తికులుగా ఉండగలరు.

మాకనపాలెంలో సోదరులు K. ఐజక్ గారు గొప్పపని చేయుచున్నారు. వారు చక్కని ఏర్పాట్లు చేసి సువార్తికుల సదస్సును దిగ్విజయముగ నిర్వహించిరి. ★

---

Regd. No. R/KD—45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
SATYA WAKKU
P.O. Box 80.
KAKINADA 533 001

No.

To
..............................
..............................
..............................
..............................